క్లుప్తంగా

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ నరేంద్రసింగ్



నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గైనిక్ స్పెషలిస్టుగా పని చేస్తున్న డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆర్థోపెడిక్ స్పెషలిస్టు డాక్టర్ వీఆర్ మోహన్ స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేయడంతో ఈ పోస్టు ఖాళీ అయ్యింది. గతంలో సూపరింటెండెంట్‌గా పని చేసిన నరేంద్రసింగ్‌కు మరలా బాధ్యతలు అప్పగించారు.

నేడు ఎమ్మెల్యే ప్రతాప్ పర్యటన

నూజివీడు: ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి నూజివీడు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు సోమవారం తెలిపాయి. వెంకటాయపాలెం, ఓగిరాల తండా, కొత్తూరు తండా, సిద్ధార్థనగర్‌లలో ఎమ్మెల్యే ప్రతాప్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, సానుభూతిపరులు తరలిరావాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు విజ్ఞప్తి చేశాయి.

నవోదయకు ఎంపిక

తిరువూరు: జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఇటీవల జరిగిన పరీక్షలో తిరువూరుకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక జన్మభూమి రోడ్డులోని విద్యార్థి శిక్షణ సంస్థకు చెందిన ప్రేమ్‌రక్షిత్, సుస్మిత నవోదయ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులైనట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



విస్సన్నపేట: స్థానిక వికాస్ పీజీ కళాశాలలో బహుళజాతి ఔషధ సంస్థ ఎంఎస్ఎన్ ల్యాబ్స్ హైదరాబాదు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 70 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు సంస్థ ప్రతినిధి ప్రశాంత్ తెలిపారు. మొత్తం 250 మంది విద్యార్థులు హాజరయారన్నారు. ఎంపికైన విద్యార్థులను వికాస్ విద్యాసంస్థల అధినేత నరెడ్ల నర్సిరెడ్డి అభినందించారు. వికాస్ కళాశాల ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ చల్లా సుధీర్‌రెడ్డి, పార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు, తిరుమలేశ్వర రావు, వెంకట్, సంస్థ క్వాలిటీ కంట్రోల్ ఏజీఎం అయ్యప్పస్వామి పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి



కాట్రేనిపాడు (ముసునూరు): మండలంలోని కాట్రేనిపాడు ప్రధాన కూడలి కేంద్రాల్లో ఎస్‌ఐ పి.వాసు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ దళాలు, పోలీసులు సోమవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీస్ దళాలు అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు ఎలాంటి అపోహ, సంకోచం లేకుండా నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాగ ఫణిభూషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



రాజవరం(గంపలగూడెం): సాధారణ ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ తెలిపారు. గంపలగూడెం మండలం రాజవరం శివారు తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరిహద్దు నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి అక్రమ మద్యం, నగదు, ఇతర విలువైన వస్తువులు తరలించకుండా తీసుకోవలసిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. గంపలగూడెం ఎస్‌ఐ ఎస్ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్లు, రికార్డులు అప్పగింత

జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల, ధర్మవరప్పాడుతండా, అన్నవరం, వేదాద్రి గ్రామాలతోపాటు పలు గ్రామాలకు చెందిన వలంటీర్లు తమ వద్ద ఉన్న ఫోన్లు, డివైజ్‌లు, రికార్డులను సోమవారం ఆయా సచివాలయాల సిబ్బందికి అందజేశారు. వలంటీర్లు వారి విధుల్లో ఉండకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో ఆయా రికార్డులను వలంటీర్లు ఆయా సచివాలయాల్లో అప్పగించారు.

పూర్వపు కష్టాలు మళ్లీ పడాలా..?

- టీడీపీ వైఖరి సమంజసం కాదంటున్న ప్రజలు
- పింఛను లబ్ధిదారుల ఆందోళన

నూజివీడు: పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను తప్పించడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మంచం మీద లేవలేని వృద్ధులు, వికలాంగులకు ఒకటో తేదీనే ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదును అందజేస్తున్న వలంటీర్ల విషయంలో టీడీపీ అనుబంధ సంస్థ ఫిర్యాదుతో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం సమంజసం కాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఉదయం వెళ్తే సాయంత్రం వరకు పడిగాపులు పడుతూ లబ్ధిదారులు పింఛన్ తీసుకునేవారు. అలాంటి పరిస్థితుల్లో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పింఛన్ల నగదును వారి ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేసేలా వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారు. దీంతో ప్రతినెలా ఒకటో తేదీన లబ్ధిదారులు ఇంటివద్దనే పింఛన్ నగదు అందుకునేవారు. ఇప్పుడు మళ్లీ సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై వృద్ధులు, వికలాంగులు ఆవేదన చెందుతున్నారు.

టీడీపీ కుట్రతో పింఛన్‌దారులకు ఇబ్బందులు



కొండపల్లిలో పింఛన్ రాలేదని చెబుతున్న వృద్ధురాలిని ఓదార్చుతున్న సర్నాల తిరుపతిరావు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): టీడీపీ నేతల కుయుక్తులతో పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. కొండపల్లిలో పర్యటిస్తున్న ఆయనకు మేడపాటి సుబ్బలక్ష్మి అనే వృద్ధురాలు ఈనెలలో పింఛన్ రాలేదని సోమవారం తన ఆవేదన తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన ఇంటికొచ్చి వలంటీర్ ఇచ్చేవారన్నారు.

పింఛన్ కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. తిరుపతిరావు ఆమెను ఓదార్చారు. ప్రతినెలా ఒకటో తేదీన అవ్వాతాతలకు పింఛన్ వలంటీర్ ద్వారా అందేదన్నారు. టీడీపీ నేత చంద్రబాబు, తన అనుచరులతో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారని చెప్పారు. దీంతో ఎన్నికల కమిషన్ వలంటీర్లను పింఛన్ ఇవ్వొద్దని చెప్పడంతో ఆలస్యం అవుతుందని ఆమెను ఓదార్చారు. వలంటీర్ల సేవలు టీడీపీ ఓర్వలేకపోతుందన్నారు. టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ చంద్రశేఖర్, వేములకొండ సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్బందులు పడేవాళ్లం



టీడీపీ హయాంలో పింఛన్ పొందాలంటే అనేక ఇబ్బందులు పడేవాళ్లం. అలాంటి పరిస్థితి లేకుండా వలంటీర్లు ప్రతినెలా ఒకటో తేదీన మా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఆ డబ్బులతో నెలకు సరిపడా మందులు తీసుకునేదాన్ని. టీడీపీ పన్నిన కుట్రల వల్ల వలంటీర్లను పింఛన్ల పంపిణీ విధుల నుంచి తప్పించారు. టీడీపీ హయాంలో పడిన కష్టాలు మళ్లీ వస్తాయేమోననీ ఆందోళనగా ఉంది.

– పోలుకొండ వనజాక్షి,
పింఛను లబ్ధిదారు, ఆగిరిపల్లి

మళ్లీ కష్టాలు తప్పవు



వలంటీర్లు ఉంటే ఒకటో తేదీన మా ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము ఇచ్చి వెళ్లేవారు. ఇప్పుడు సచివాలయంలో సిబ్బంది ఎప్పుడు ఇస్తారో తెలియదు. నాకు మోకాలు నొప్పులు. కానీ పింఛన్ కోసం గంటల కొద్ది క్యూలో నిలబడాలంటే చాలా కష్టంగా ఉంటుంది. అసలే ఎండాకాలం ఎండలో ఇబ్బందులు పడాల్సిందేనా..!

– చిటికెల కోటేశ్వరరావు,
పింఛను లబ్ధిదారు, ఆగిరిపల్లి

వలంటీర్లపై ఎందుకీ కక్ష



నాలాంటి పింఛన్‌దారులకు టెన్షన్ లేకుండా ఒకటో తేదీన పొద్దున్నే పింఛన్లు ఇచ్చే వలంటీర్ పిల్లలపైనా మీ ప్రతాపం. ఇది సరియైన పద్ధతి కాదు. ఈ సమయానికి పంపిణీ పూర్తి చేసి, పేద వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు వలంటీర్లు సంతోషం పంచేవారు. వలంటీర్ల ఉసురు చంద్రబాబు, పవన్, నిమ్మగడ్డకు ఖచ్చితంగా తగులుతుంది.

–దుబ్బాకు అనంతయ్య,
పింఛను లబ్ధిదారు, లోపూడి

వైఎస్సార్ సీపీ నేతలపై దుష్ప్రచారాలు మానండి



రమణక్కపేటలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజలు

ముసునూరు: వైఎస్సార్ సీపీ నేతలపై ఇష్టానుసారంగా పచ్చపత్రికలు అసత్య కథనాలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని వైఎస్సార్ సీపీ నేతలు మండిపడ్డారు. రమణక్కపేటలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజలు మాట్లాడారు. రమణక్కపేటలో గ్రామ సర్పంచ్ రంగు ధనలక్ష్మి, గాంధీ 11వ వార్డులో పది కంటే ఎక్కువ అంతర్గత రహదారులు వేయించి, నిరంతరాయంగా మంచినీటి సరఫరా చేయిస్తుంటే, ఆ వార్డుపై కావాలనే ఎమ్మెల్యే మేకా ప్రతాప్ వివక్ష చూపుతున్నారని టీడీపీ నేతలు విమర్శలు చేయడం, వాటిని జేబు పత్రికల్లో ప్రచురించడం పద్ధతి కాదన్నారు. నిజంగానే ఆ వార్డులో రెండేళ్లుగా మంచినీటి సమస్య ఉంటే ప్రజలు చూస్తు ఊరుకుంటారా అని ప్రశ్నించారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో కన్నా రమణక్కపేటలోనే ఎక్కువ అభివృద్ధి జరిగిందని, మంచినీటి పైపులైన్లు సైతం వేసి, సమస్య తీర్చారని, దీనిపై ఎవరైనా బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ వెంకమ్మ, మాజీ ఉప సర్పంచ్ కృపారావు, పార్టీ యువనేతలు సర్వేశ్వరరావు, కృష్ణమోహన్, మోహనరావు, కృష్ణ, మాళావత్ శ్రీను, రజని, పద్మ, నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

డొంక భూమి ఆక్రమణపై ఫిర్యాదు



తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ నాగమల్లేశ్వరి

ఏ.కొండూరు: ఎటువంటి అనుమతులు లేకుండా రెవెన్యూ పోరంబోకు భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి చదును చేస్తున్నారని సర్పంచ్ పర్వతనేని నాగమల్లేశ్వరి సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ మండలంలోని కృష్ణారావుపాలెం పంచాయతీ పరిధిలోని ఆర్ఎస్ 306, 307 నంబర్లలో రెవెన్యూ పోరంబోకు భూమిలోని డొంకను చదును చేస్తున్నారన్నారు. పంచాయతీ అనుమతులు లేకుండాపై డొంకను ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ మాట్లాడుతూ ఆక్రమణలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణకు గురి అవుతున్న భూమిని సర్వే చేయించి డొంకలో చెట్లను నరికి విక్రయించినట్లు తమ విచారణలో వెల్లడైతే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఈ మేరకు చర్యలు ప్రారంభిస్తామని చెప్పారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు పర్వతనేని చంద్రమోహనరావు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



పోతురెడ్డిపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో కే కిరణ్‌కుమార్

నూజివీడు: మండలంలోని పోతురెడ్డిపల్లిలో చలివేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో కే కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఎండల నుంచి ప్రజలు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామంలో అవసరమైన మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

తిరువూరు: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో తిరువూరు సినిమాహాల్స్ సెంటర్లో మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు నాళ్ళా కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఇన్‌చార్జి గుడిమెట్ల రమేష్, సభ్యులు నాళ్ళా రామారావు, జూలూరి వెంకటరమణయ్య, నాళ్ళా సూర్యప్రకాశరావు, సతీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. తమ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా వేసవిలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షుడు కృష్ణారావు తెలియజేశారు.

బీఎల్వోలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ఆర్ఓ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఆర్‌వో వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో బీఎల్వోలు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో సెక్టార్ ఆఫీసర్లు, బీఎల్‌వోలతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా అవకాశం కల్పించిన హోం ఓటింగ్‌పై బీఎల్వోలకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. 85 ఏళ్ల వయస్సు దాటిన వారు, దివ్యాంగులు(పీడబ్ల్యూడీ) ఎవరైతే ఓటు వేయడానికి రాలేని పరిస్థితుల్లో ఉన్నారో వాళ్లకు మాత్రమే అప్లికేషన్లు ఇచ్చి సకాలంలో దరఖాస్తులు కలెక్ట్ చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు సదరన్ సర్టిఫికెట్, 40శాతం పైన వికలత్వం ఉన్నట్లుగా ఏదైనా ప్రభుత్వ వైద్యులచే ధ్రువీకరణపత్రం ఉంటే ఇంటినుంచి ఓటువేసే అవకాశం కల్పించాలన్నారు. ఇప్పటి వరకు హోం ఓటింగ్‌కు పట్టణంతోపాటు పేట మండలంలో 108 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోల తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పేట తహసీల్దార్, ఏఈఆర్‌వో శేషగిరి, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల తహసీల్దార్లు వి.అమ్మాజీ, కె.సూర్యారావు, పేట మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, పేట ఎంపీడీవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించొద్దు : డీసీపీ



పెనుగంచిప్రోలు: గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని విజయవాడ రూరల్ డీసీపీ కె శ్రీనివాసరావు హెచ్చరించారు. గ్రామంలో గత రెండు మూడురోజులుగా జరుగుతున్న ఘర్షణ, ఉద్రిక్తత వాతావరణానికి సంబంధించి ఆదివారం రాత్రి స్థానిక బీసీ కాలనీలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎలాంటి అసాంఘిక చర్యలకు పాల్పడినా చర్యలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. ఎవరో ఒకరిద్దరి చర్యల కారణంగా అందరికీ ఇబ్బందులు వస్తాయన్నారు. అందరూ సంయమనంతో ఉండి ప్రశాంత వాతావరణానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ రవికిరణ్, సీఐలు జానకిరామ్, పి.చంద్రశేఖర్, ఎస్ఐ పి రాంబాబు పాల్గొన్నారు. గ్రామంలో ప్రత్యేక బలగాలతో పాటు పికెట్ నిర్వహిస్తున్నారు.

సైకిల్ స్టాండ్ ప్రారంభం

కంచికచర్ల : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సైకిల్ స్టాండ్‌ను ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం సోమవారం ప్రారంభించారు. బస్టాండ్‌లో వసతులపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని శుభ్రం చేయడంలేదని మహిళా ప్రయాణికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన వివరించారు. కొన్నేళ్లుగా బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో సైకిల్ స్టాండ్‌ను తిరిగి ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) శ్రీదేవి, బస్టాండ్ సూపర్‌వైజర్ సామ్యేలు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

తోట్లవల్లూరు: మండలంలోని చినపులిపాకలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులను సోమవారం సర్పంచ్ ఆరేపల్లి శివరామకృష్ణ ప్రారంభించారు. స్థానిక వెస్ట్‌సైడ్ చానల్లో కూలీలతో కలిసి శివరామకృష్ణ పూజలు జరిపి పనులకు శ్రీకారం చుట్టారు. పనులకు 150 మంది వరకు కూలీలు హాజరయ్యారు. విద్యా కమిటీ చైర్మన్ నాగేంద్ర, పంచాయతీ వార్డు సభ్యులు సుంకర సీతారామయ్య, వడ్డాణం దుర్గ, సన్నాల గోపీరాజ, పతం రామకృష్ణ(చిన్న), ఫీల్డ్ అసిస్టెంట్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి మార్పునకు అధిష్టానం కసరత్తు..?

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావును మార్చేందుకు ఆ పార్టీ అధిష్టానం యోచిస్తున్నట్లు తెలిసింది. ఎన్డీయే కూటమి అభ్యర్థిగా ఉన్న ఆయన ఇతర పార్టీలను కలుపుకొని పోవట్లేదని, టీడీపీ సీనియర్లను సైతం విస్మరించారని అధిష్టానానికి ఫిర్యాదులు అందాయని తెలుస్తోంది. దీంతో వేరొకరిని ఈ స్థానంలో పోటీ నిలపాలని పార్టీ భావిస్తున్నట్లు తెలిసింది. మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్, ప్రస్తుత తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధిలలో ఒకరికి అవకాశం ఇవ్వనున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి. పలుమార్లు వివాదాస్పద వ్యాఖ్యలతో కొన్ని వర్గాలకు మనస్తాపం కలిగించిన కొలికపూడిపై ఆ పార్టీ నాయకులు గుర్రుగా ఉండటంతో సహకరించే అవకాశం లేదని చెబుతున్నారు. కొవ్వూరులో టికెట్ దక్కించుకోలేకపోయిన మాజీ మంత్రి జవహర్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి పొందినా శాంతించకపోవడంతో ఆయనకు కేటాయిస్తారంటున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): అన్ని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపడుతున్నామని నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ మహాలక్ష్మణుడు, పోలీసులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుతో సోదర భావం



ఆగిరిపల్లిలో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ప్రజల్లో సోదర భావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. సోమవారం రాత్రి స్థానిక మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. మసీద్ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో షాదీఖానాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ప్రతాప్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి గబ్బర్, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీటీసీ నాగుల్ మీరా, పార్టీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనా కుమారి, జిల్లా వక్ఫ్ బోర్డ్ కమిటీ మెంబర్ సుభాని, పార్టీ మండల యువత అధ్యక్షుడు బెజవాడ శ్రీహర్ష, మైనార్టీ నాయకులు సుభాని, రంజాన్, ఎస్కే బాషా, పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ రాంబాబు, నక్కన బోయిన పండు, వాకా సత్యేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయం



కొండపల్లిలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న సర్నాల తిరుపతిరావు

కొండపల్లి (ఇబ్రహీంపట్నం): ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయమని మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. కొండపల్లి-1, 2వ వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించారు. స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయా ప్రాంతాల్లోని ముఖ్య నాయకులను కలుసుకున్నారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ముస్లిం పెద్దలు నమాజు చేసి ఆశీస్సులు అందించగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించారన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లేసి వైఎస్సార్ సీపీని మరలా గెలిపించాలని కోరారు.

తిరుపతిరావును గెలిపించండి..

నియోజకవర్గంలో పెత్తందారుడిపై పోటీచేస్తున్న సామాన్యుడు తిరుపతిరావును గెలిపించాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ కోరారు. కొండపల్లిలో పర్యటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులను ఆయన కలిసి సంఘీభావం తెలిపారు. పెత్తందారీ వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలించేందుకు ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలు అందరూ ఏకం కావాలని పిలుపు ఇచ్చారు. ప్రభుత్వంలో ఉండి పబ్బం గడుపుకున్న తర్వాత సీఎం జగన్‌పై విమర్శలు చేయడం పెత్తందారుల అహంకారానికి నిదర్శనంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ నిలిచారని విమర్శించారు. పట్టణ, మండల అధ్యక్షులు మిక్కిలి శరభయ్య, బొంత సాంబశివరావు, కౌన్సిలర్‌లు ఎం.చంద్రం, గుంజా శ్రీనివాస్, పోరంకి శ్రీనివాసరాజు, వాహెద్, బేగ్, ఎస్.సుభాష్, కోమటి కోటేశ్వరరావు, ఎం.సుధీర్, చందా చంటి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని ఎంపీ కేశినేని నాని, నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతి రావు, నియోజకర్గం పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, కర్ర హర్షవర్ధన్ రెడ్డి సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ధనవంతులకు ఎమ్మెల్యే టిక్కెట్లు ఇస్తే వైఎస్సార్ సీపీ సామాన్యులకు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చిందన్నారు. మైలవరం నియోజకవర్గంలో సర్నాల తిరుపతిరావు గెలుపుతో వైఎస్సార్ సీపీ జెండా మరోసారి ఎగురవేసి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. సామాన్య కార్యకర్తలను ఎమ్మెల్యే అయ్యే అవకాశం ఇవ్వడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా మరోసారి నిలిచారన్నారు.

జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, సీనియర్ నాయకులు జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, మిక్కిలి శరభయ్య, గుంజా శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరిస్తాం



తిరువూరు 12వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీలో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి తెలిపారు. తిరువూరు 12వ వార్డులోని పీటీకొత్తూరులో సోమవారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు గెలుపు కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పీటీ కొత్తూరులో తాగునీరు, రహదారుల అభివృద్ధి, జగనన్న కాలనీలో సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు చలమాల సత్యనారాయణ, పరసా శ్రీనివాసరావు, అంబటి వెంకటనారాయణరెడ్డి, వెంకటేశ్వరి, విజయలక్ష్మి, మస్తాన్, కోటేశ్వరరావు, కృష్ణారెడ్డి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఈ విద్యార్థుల ప్రతిభ



బహుమతి పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

మైలవరం: ఇన్నోవేషన్ ఫెయిర్‌లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విద్యార్థులు ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు సోమవారం తెలిపారు. మార్చి 27, 28 తేదీలలో జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహించిందన్నారు. తమ కళాశాలకు చెందిన సీఎస్ఈ విభాగం నుంచి ఐడియా ఎన్‌హాన్సింగ్ మొబైల్ సెక్యూరిటీ విత్ యాన్ ఆటోమేటెడ్ సిమ్ స్లాట్ ఎజెక్షన్ సిస్టమ్ అండ్ ఆథెంటికేషన్ మెకానిజమ్ అనే అంశంపై ఆఖరి సంవత్సరం విద్యార్థి యు.అర్జున్, తృతీయ సంవత్సరం విద్యార్థినులు బీ గ్రేసీ, ఎల్.మనీషా పాల్గొని మొదటి బహుమతి పొందారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ డి. వీరయ్య, కోఆర్డినేటర్లు, మెంటార్స్ డాక్టర్ ఏ.నరేంద్రబాబు, డాక్టర్ డీ వెంకట సుబ్బయ్య తదితరులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

గంపలగూడెం: మండలంలోని కట్టిలేరు పెద్దకొమిర ఇసుక రేవు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ ఎస్.శ్రీను ఆకస్మికంగా దాడి చేసి సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మండల శివారు రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అమ్మిరెడ్డిగూడెం చెందిన రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణకు ఇసుక రవాణా చేస్తున్నట్లు విచారణలో తెలిందన్నారు. రెండు ట్రాక్టర్లపై వోల్టా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఈ సందర్భంగా వివరించారు.